

నాడు బతుకు వేట.. నేడు అభివృద్ధి బాట

ఎడారి బతుకులు, పడుపు వృత్తి, వలసలు, దుర్భర దారిద్ర్యం.. పోరాట ఆరాటాలకు తంబళ్లపల్లె నియోజకవర్గం ఒకప్పుడు వేదికైంది. నక్సల్ ఉద్యమానికి ఇక్కడి నుంచి ఉన్నత స్థాయికి ఎదిగిన వారెందరో తుపాకి తుటాలకు బలయ్యారు. హత్యలు, ప్రతీకార హత్యలతో ఈ ప్రాంతం రక్తమోడింది. బ్రిటిష్ కాలంలో మదనపల్లె కలెక్టర్‌గా పనిచేసిన హార్సిలీ మనసు దోచిన ప్రాంతం కూడా ఇదే. 'ఆంధ్రా ఊటీ'గా పిలువబడే మన హార్సిలీ హిల్స్, ప్రపంచ విద్యా కేంద్రం రిషివ్యాలీ, ఆధ్యాత్మిక శైవక్షేత్రం మల్లయ్యకొండ తంబళ్లపల్లె మణిహారాలు.

- కరువు నేలపై భూస్వామ్య, నక్సలైట్ ఆధిపత్యం
- ఆంధ్రా ఊటీ హార్సిలీహిల్స్, ఆధ్యాత్మిక క్షేత్రం మల్లయ్యకొండ ఇక్కడే
- 15 అసెంబ్లీ ఎన్నికల్లో 5సార్లు టీఎన్, 4 సార్లు కలిచర్ల, 3 సార్లు ఏవీ కుటుంబాల ఏలుబడి
- 2019 ఎన్నికలో పెద్దిరెడ్డి కుటుంబం రాక

బి.కొత్తకోట: ఒకప్పుడు నిత్య కరువు, వలసలు, కనుచూపుమేరలో కనిపించని సాగునీటి వనరులు, ఎటుచూసినా ఎండిన పొలాలు, పొట్టకూటి కోసం ముంబై, బెంగళూరు, హైదరాబాద్‌కు కుటుంబాలతో వలసలకు పెట్టింది పేరు అన్నమయ్య జిల్లాలోని తంబళ్లపల్లె నియోజకవర్గం. పొట్టచేత పట్టుకుని ఎడారి దేశాలకు వెళ్లి శవాలైన తిరిగొచ్చిన విషాద ఘటనలు ఉన్నాయి. బతకడం కోసమే ముంబై, పూణే, ఢిల్లీల్లోని వ్యభిచార గృహాల్లో మగ్గిపోయిన అభాగ్యులున్నారు. ఇలాంటి దయనీయ పరిస్థితికి నిలయమైన నియోజకవర్గంపై ఆధిపత్యం కోసం వర్గ రాజకీయాలు రాజ్యమేలాయి. ఆధిపత్యం కోసం జరిగిన హత్యా రాజకీయాలకు ఎందరో బలయ్యారు. పీపుల్స్‌వార్ రాష్ట్ర చరిత్రలో తంబళ్లపల్లె ఉద్యమ పోరాటం సువర్ణాక్షరాలతో లిఖితమైంది. 2000 తర్వాత నియోజకవర్గ పరిస్థితుల్లో మార్పు రావడంతో ప్రశాంతత వైపు అడుగులు వేసింది. 2019 నుంచి అభివృద్ధి, సంక్షేమంతో దూసుకెళ్తోంది.

రసవత్తర పోరు

రాష్ట్ర, జిల్లా రాజకీయాల్లో తంబళ్లపల్లె నియోజకవర్గానికి ఘన చరిత్ర ఉంది. కంటిచూపుతో రాజకీయాలు శాసించిన నేతలున్న నియోజకవర్గమిది. పూర్వ చిత్తూరు, ప్రస్తుత అన్నమయ్య జిల్లాలో మారుమూలన, కర్ణాటక, సత్యసాయి, వైఎస్ఆర్ కడపజిల్లా సరిహద్దులోని తంబళ్లపల్లె నియోజకవర్గం 1955లో ఏర్పడింది. బి.కొత్తకోట మండలంలోని గట్టు నియోజకవర్గంగా 1952లో మద్రాసు ప్రభుత్వంలో తొలి ఎన్నికలు జరిగాయి. తెలుగు రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత 1955లో జరిగిన ఎన్నిక నుంచి తంబళ్లపల్లె కేంద్రంగా నియోజకవర్గం ఏర్పడింది. తంబళ్లపల్లె, ములకలచెరువు, పెద్దతిప్పసముద్రం, పెద్దమండ్యం మండలాలు, బి.కొత్తకోట మండలంలోని ఐదు పంచాయతీలను కలిపి నియోజకవర్గం ఏర్పాటు చేశారు. 2020 డిసెంబర్‌లో మేజర్ పంచాయతీగా ఉన్న బి.కొత్తకోట నగర పంచాయతీగా ఎదిగింది.



తొలి ఏకగ్రీవ ఎంపీ విశ్వనాథరెడ్డి

1952లో లోక్‌సభ తొలి ఎన్నికల్లో తంబళ్లపల్లెకు చెందిన టీఎన్. విశ్వనాథరెడ్డి చిత్తూరు లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి 1,61,590 ఓట్లతో విజయం సాధించారు. ఆ తర్వాత 1957లో జరిగిన రెండో లోక్‌సభ ఎన్నికల్లో ఆయన కడప జిల్లా రాజంపేట నుంచి లోక్‌సభ బరిలో దిగారు. కాంగ్రెస్ అభ్యర్థిగా విశ్వనాథరెడ్డి నామినేషన్ వేయగా ఆయనకు పోటీగా మిగతా పార్టీల తరఫున అభ్యర్థులు నామినేషన్లు వేయకపోవడంతో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

- 2009 ఎన్నికల వరకు తంబళ్లపల్లె రాజకీయాల్లో టీఎన్, కలిచర్ల కుటుంబాలదే పైచేయి. తొలి సార్వత్రిక ఎన్నికలు 1952 నుంచి 2004 వరకు ఎమ్మెల్యే పదవి విషయంలో ఈ రెండు కుటుంబాల మధ్య పోరు నడిచింది. ఎమ్మెల్యే, రాజంపేట ఎంపీగా ఏకగ్రీవంగా ఎన్నికైన చరిత్ర టీఎన్ కుటుంబానిదే. ఈ కుటుంబం నుంచి టీఎన్.రామకృష్ణారెడ్డి ఉమ్మడి మద్రాసు రాష్ట్ర ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. స్వాతంత్ర్యం వచ్చాక ఒక సారి ఎంపీగా, ఐదుసార్లు ఎమ్మెల్యేలుగా ఈ కుటుంబ సభ్యులే గెలిచారు. ఒకసారి టీఎన్ కుటుంబం, ఒకసారి కలిచర్ల కుటుంబం స్వతంత్ర అభ్యర్థులుగా పోటీచేసి అసెంబ్లీలో అడుగుపెట్టారు. 1983లో రాష్ట్రమంతా ఎన్టీఆర్ ప్రభంజనంలో కూడా తంబళ్లపల్లెలో టీఎన్. శ్రీనివాసులురెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి టీడీపీ, కాంగ్రెస్‌కు సవాల్ విసిరారు. 1978లో ఆవుల మోహన్‌రెడ్డి కాంగ్రెస్ తరఫున ఒకసారి, 1985 నుంచి జరిగిన ఎన్నికల్లో అనిపిరెడ్డి వెంకట కుటుంబం నుంచి ఏవీ లక్ష్మీదేవమ్మ రెండుసార్లు, ఆమె తనయుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఒకసారి టీడీపీ తరఫున ఎమ్మెల్యే అయ్యారు. 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి నియోజకవర్గ చరిత్రను తిరగరాసే మెజార్టీని సాధించారు.

తంబళ్లపల్లె ఎమ్మెల్యేలు

1952–టీఎన్.వెంకటసుబ్బారెడ్డి (కాంగ్రెస్)
1955–టీఎన్.వెంకటసుబ్బారెడ్డి(కాంగ్రెస్–ఏకగ్రీవం)
1962– కె.నరసింహారెడ్డి (కాంగ్రెస్)
1967–టీఎన్.అనసూయమ్మ (కాంగ్రెస్)
1972–టీఎన్.అనసూయమ్మ (కాంగ్రెస్)
1978– ఏ.మోహన్‌రెడ్డి (కాంగ్రెస్)
1983–టీఎన్.శ్రీనివాసులురెడ్డి (ఇండిపెండెంట్)
1985– ఏవీ.లక్ష్మీదేవమ్మ (టీడీపీ)
1989– కె.ప్రభాకర్‌రెడ్డి (ఇండిపెండెంట్)
1994–ఏవీ.లక్ష్మీదేవమ్మ (టీడీపీ)
1999–కె.ప్రభాకర్‌రెడ్డి (కాంగ్రెస్)
2004–కె.ప్రభాకర్‌రెడ్డి (కాంగ్రెస్)
2009–ఏవీ.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి (టీడీపీ)
2014–జి.శంకర్‌యాదవ్ (టీడీపీ)
2019–పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి (వైఎస్సార్‌సీపీ)

2019 నుంచి 2023 వరకు పథకాల ద్వారా కలిగిన లబ్ధి

మండలం	లబ్ధిదారులు	లబ్ధి(రూ.కోట్లలో)
డీబీటీ		(అంచనా..)
బి.కొత్తకోట	55,646	156.63
పెద్దతిప్పసముద్రం	92,371	250.05
ములకలచెరువు	82,533	216.42
తంబళ్లపల్లె	69,078	207.81
కురబలకోట	75,666	210.77
పెద్దమండ్యం	68,494	182.71
నాన్ డీబీటీ		
బి.కొత్తకోట	16,330	32.83
పెద్దతిప్పసముద్రం	24,912	48.22
ములకలచెరువు	22,483	51.44
తంబళ్లపల్లె	19,679	48.42
కురబలకోట	22,639	57.86
పెద్దమండ్యం	21,228	40.05

తంబళ్లపల్లె నియోజకవర్గ అభివృద్ధి

- ✔ పంచాయతీరాజ్‌శాఖ ద్వారా రూ.388.03 కోట్లతో 665.145 కిలోమీటర్ల మేర ఉన్న 355 మట్టి రోడ్లను తారు రోడ్డుగా నిర్మాణం.
- ✔ రహదారి భవనాలశాఖ ద్వారా రూ.100.74 కోట్లు మంజూరు. ఇందులో 67 కిలోమీటర్ల రహదారుల అభివృద్ధి, కొత్త రహదారుల నిర్మాణాలు జరిగాయి.
- ✔ తంబళ్లపల్లె సమీపంలోని మల్లయ్యకొండపై వెలసిన మల్లికార్జునస్వామి ఆలయజీర్ణోద్ధరణ పనులకు రూ.3.15 కోట్లు మంజూరు. పూర్తిదశలో పనులు
- ✔ మల్లయ్యకొండకు రూ.6.75 కోట్లతో తారురోడ్డు నిర్మాణం
- ✔ వైద్యవిధాన పరిషత్ ఆస్పత్రుల్లో రూ.6.53 కోట్లతో ఆక్సిజన్ ప్లాంట్లు, మౌలిక వసతుల కల్పన
- ✔ గడప గడపకు మన ప్రభుత్వం, ఉపాధి హామీ పథకం ద్వారా రూ.26.16 కోట్ల మురికినీటి కాలువలు, సీసీరోడ్లు, ఇతర అభివద్ధి పనులు.
- ✔ జల్‌జీవన్ మిషన్–ఏపీ ప్రభుత్వ నిధులు రూ.17.10 కోట్లతో ఇంటింటికీ కొళాయి ఏర్పాటు
- ✔ కురబలకోట మండలం ముదివేడు వద్ద రూ.775 కోట్లతో రిజర్వాయర్ నిర్మాణం, ఎన్‌జీటీ తీర్పుతో ఆగిన పనులు.
- ✔ హంద్రీనీవా ప్రాజెక్టు రెండోదశకు చెందిన పుంగనూరు ఉప కాలువ విస్తరణకు రూ.1,219 కోట్లతో కాంట్రాక్టర్‌తో పనులు చేపట్టేందుకు ఒప్పందం. త్వరలో పనులు ప్రారంభం.
- ✔ సుమారు రూ.500 కోట్లతో నియోజకవర్గంలో వాటర్‌గ్రిడ్ పనులు. సర్వే పూర్తి, త్వరలో పనులు ప్రారంభం.
- ✔ నాడు–నేడు ద్వారా రూ.54.80 కోట్లతో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి
- ✔ పేదలకు మంజూరు చేసిన పక్కా ఇళ్ల నిర్మాణాలకు చెందిన బిల్లులు రూ.123 కోట్లు చెల్లింపు.
- ✔ కురబలకోటలో రూ.5 కోట్లతో చింతపండు ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు.
- ✔ బి.కొత్తకోట మండలం గుంతావారిపల్లె, ములకలచెరువుల్లో రూ.10.10 కోట్లతో టమాట ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు.
- ✔ రూ.2 కోట్లతో ఆలయాల అభివృద్ధి
- ✔ రూ.31.50 కోట్లతో 72 సచివాలయాల భవనాలు నిర్మాణం
- ✔ రూ.15.8 కోట్లతో 66 రైతుభరోసా కేంద్రాల నిర్మాణం
- ✔ రూ.7.28 కోట్లతో హెల్త్ సెంటర్ల నిర్మాణం
- ✔ రూ.35 లక్షలతో నాలుగు పాలశీతలీకరణ కేంద్రాల ఏర్పాటు


నియోజకవర్గ ప్రత్యేకతలు

- ➢ సముద్ర మట్టానికి 4,141 అడుగుల ఎత్తులో.. ఆంధ్రా ఊటీగా పేరొందిన హార్సిలీహిల్స్ బి.కొత్తకోట మండలంలో ఉంది.
- ➢ ప్రపంచ ప్రఖ్యాత విద్యాలయం, తత్త్వవేత్త జిడ్డు కృష్ణమూర్తి స్థాపించిన రిషివ్యాలీ విద్యాలయం కురబలకోట మండలం తెట్టులో ఉంది.



- ➢ కరికాళ చోళులు నిర్మించిన ప్రముఖ శైవ క్షేత్రం మల్లికార్జునస్వామి వెలసిన మల్లయ్యకొండ తంబళ్లపల్లె సమీపంలో ఉంది.
- ➢ మలిచోళులు, విజయనగర రాజుల కాలంలో నిర్మించిన ప్రఖ్యాత చెన్నకేశవ ఆలయం ములకలచెరువు మండలం సొంపాళ్యంలో ఉంది.
- ➢ చిన్న తిమ్మమ్మ మర్రిమానుగా పేరొందిన మర్రిచెట్టు తంబళ్లపల్లె మండలంలో ఉంది.

గర్జించిన గద్దర్



నియోజకవర్గంలో 1980–90 దశాబ్దాల్లో నక్సలిజం ఉవ్వెత్తున ఎగిసింది. 1991లో మదనపల్లెలో జరిగిన సభకు గద్దర్ హాజరై తంబళ్లపల్లె భూస్వాములకు తీవ్ర హెచ్చరికలు చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పీపుల్స్‌వార్ కార్యకలాపాలు పుట్టింది ఇక్కడే. తంబళ్లపల్లె మండలంలోని అన్నగారిపల్లెలో నక్సలైట్ల ధర్మగంట ఏర్పాటు ఒక అధ్యాయం. అన్యాయానికి గురైన వారు ఈ గంట మోగిస్తే రాత్రివేళల్లో అన్నలు పల్లెలోకి వచ్చి తీర్పులు ఇచ్చేవారు. భూ సమస్యలపై జరిగిన వివాదాల్లో ములకలచెరువు, తంబళ్లపల్లె మండలాల్లో నక్సలైట్లు, వారి వ్యతిరేక వర్గాల మధ్య జరిగిన ఘటనల్లో 13 మంది చనిపోయారు. పీపుల్స్‌వార్ జిల్లా కార్యదర్శులుగా చౌడసముద్రానికి చెందిన ఎల్‌వీ.రమణ, కలిచర్లకు చెందిన కృష్ణప్ప, మల్లూరివాండ్లపల్లెకు చెందిన రామచంద్రారెడ్డి పనిచేశారు. కృష్ణప్ప, ఆయన తమ్ముడు జనార్దన్ ఎన్‌కౌంటర్‌లో చనిపోయారు.

ఓటర్ల వివరాలు



నియోజవర్గంలో ప్రస్తుత ఓటర్లు: 2,14,560

పురుషులు: 1,05,984

స్త్రీలు: 1,08,566

ఇతరులు: 10

నియోజకవర్గ సమాచారం

సచివాలయాలు : 79
రైతు భరోసా కేంద్రాలు : 73
ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు : 7
సామాజిక ఆరోగ్య కేంద్రాలు : 2
వెల్నెస్ సెంటర్లు: 62



కరెన్సీతో అమ్మవారికి అలంకరణ



పెద్దతిప్పసముద్రం : క్రోధి నామ సంవత్సరం, శుభ శుక్రవారం సందర్భంగా స్థానిక శివాలయంలో రూ.1.50 లక్షల కొత్త కరెన్సీ నోట్లతో లక్ష్మీ అమ్మవారికి అలంకరణ చేశారు. శివాలయం సేవకులు సనగరం పట్టాభిరామయ్యతో పాటు వేద పండితులు భక్తి శ్రద్ధలతో అమ్మవారికి కరెన్సీతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి దర్శనం చేసుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

వృద్ధులు, పిల్లలకు పండ్లు పంపిణీ

పెద్దతిప్పసముద్రం : మండలంలోని యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ సెక్రటరీ శ్రీనివాసులు తన కుమార్తె పుట్టిన రోజు వేడుకలను శబరి అనాథ ఆశ్రమంలో శుక్రవారం జరుపుకున్నారు. తన భార్య పవిత్ర, కుమార్తె జ్ఞాపికలతో కలసి ఆశ్రమంలోని వంద మంది చిన్నారులు, వృద్ధులకు పండ్లు, స్వీట్లు, చల్లని పానీయాలు పంచి పెట్టారు. ఫౌండేషన్ అధ్యక్షుడు రాజశేఖర్, సభ్యులు అనిల్, అష్రఫ్, సురేష్, రెడ్డెప్పలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కాంతార నృత్య ప్రదర్శన


మిట్స్ అశ్వలో అలరించిన కాంతారా నత్యం

కురబలకోట : కన్నడ, తెలుగుతో పాటు వివిధ భాషల్లో కలెక్షన్ల సునామీ సృష్టించిన కాంతార సినిమాలోని వరాహ రూపం క్లాసిక్ పాట ఆ సినిమాకు ప్రాణంగా నిలిచింది. ఈ పాట అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల అశ్వ ఫెస్టివల్‌లో ప్రత్యేక ప్రశంసలు అందుకుంది. జాతీయ స్థాయిలో జరిగిన అశ్వ ఫెస్టివల్‌లో భాగంగా కళాశాల విద్యార్థులు శుక్రవారం రాత్రి వరాహ రూపం పాటను ప్రదర్శించారు. చూపరులను మంత్ర ముగ్ధులను చేసింది. విద్యార్థులు ప్రదర్శించిన తీరు ఆకట్టుకుంది.

12 నామినేషన్లకు అనుమతి

తంబళ్లపల్లె : తంబళ్లపల్లె నియోజకవర్గం –162 అసెంబ్లీ సాధారణ ఎన్నికలకు గానూ 34 మంది అభ్యర్థులు తమ నామినేషన్లు దాఖలు చేశారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో ఈఆర్వో రాజేంద్ర అభ్యర్థుల సమక్షంలో నామినేషన్ పత్రాలను పరిశీలించారు. కె.సుజాత (బహుజన సమాజ్‌పార్టీ), ఎంయన్ చంద్రశేఖర్‌రెడ్డి(కాంగ్రెస్), డి.జయచంద్రారెడ్డి(టీడీపీ), పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి(వైఎస్సార్‌సీపీ), పీట్ల అంజలిరాజనాల (జయ భారత్ నేషనల్ పార్టీ), డి.జయచంద్రారెడ్డి (జాతీయ జనసేన), గూండాల క్రిష్ణప్ప ఇండిపెండెంట్, వై.ద్వారకనాథరెడ్డి ఇండిపెండెంట్, ఎన్.నరసింహులు ఇండిపెండెంట్, ఎంఎస్ భానుచంద్రారెడ్డి ఇండిపెండెంట్, పివి వెంకటరెడ్డి ఇండిపెండెంట్, యం.సురేష్ ఇండిపెండెంట్ అభ్యర్థుల నామినేషన్లు అనుమతించినట్లు ఈఆర్వో తెలిపారు.

మిట్స్‌లో స్ట్రాంగ్ రూమ్ పరిశీలన

కురబలకోట : ఎన్నికల అబ్జర్వర్ కవిత శుక్రవారం మండలంలోని అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు. సీసీ కెమెరాలు, భద్రత చర్యలు, పరిసర ప్రాంతాలను పర్యవేక్షించారు. అనంతరం అంగళ్లు జెడ్పీ హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఓటర్లకు కల్పించాల్సిన మౌలిక వసతులు, సౌకర్యాలపై సూచనలు ఇచ్చారు. ఎన్నికలు పకడ్బందీగా పారదర్శకంగా నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

ఆర్టీసీని ఆదరించండి


లక్కీడిప్ డ్రా చూస్తున్న డీఎం వెంకటరమణారెడ్డి

మదనపల్లె సిటీ : ప్రయాణికులు ఆర్టీసీని ఆదరించాలని ఆర్టీసీ–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి అన్నారు. శుక్రవారం మదనపల్లె బస్టాండులో మదనపల్లె–బి.కొత్తకోట రూట్‌లో లక్కీడిప్ డ్రా తీశారు. మొదటి బహుమతి వెన్నెల, రెండవ బహుమతులు గోపాల్, మూడవ బహుమతి జ్యోత్స్న గెలుచుకున్నారు. ప్రయాణికులు బస్సుల్లో ప్రయాణించేటప్పుడు తమ టిక్కెట్టు వెనుకవైపున పేరు, సెల్‌ఫోన్ నంబరు రాసి గిఫ్ట్‌బాక్సులో వేయాలన్నారు. కార్యక్రమంలో సీఐ రేవతి, సిబ్బంది పాల్గొన్నారు.

నామినేషన్ల పరిశీలన ప్రక్రియ పూర్తి

- నలుగురు అభ్యర్థులు, ఐదు అప్లికేషన్ల తిరస్కరణ
- 28 నామినేషన్లకు ఆమోదం
- 29వరకు ఉపసంహరణలకు గడువు

మదనపల్లె : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కీలకఘట్టమైన నామినేషన్ల పరిశీలన శుక్రవారంతో ముగిసింది. 164–మదనపల్లె అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి...ఈనెల 18 నుంచి 25వ తేదీ మధ్యాహ్నం 3 గంటలవరకు 19 మంది అభ్యర్థులు, 33 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. వీటికి సంబంధించి ఎలక్షన్ కమిషన్ షెడ్యూల్ ప్రకారం శుక్రవారం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి హరిప్రసాద్ ఆధ్వర్యంలో నామినేషన్ల స్క్రూటినీ ప్రక్రియ నిర్వహించారు. ఎలక్షన్స్ అబ్జర్వర్స్ కవిత మన్నికెరి, వైభవ్ శుక్లా సమక్షంలో అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్ పత్రాలను పరిశీలించారు. అనంతరం ఎన్నికలసంఘం నిబంధనలు పాటించని నామినేషన్లను తిరస్కరిస్తున్నట్లు ప్రకటించారు. అందులో వైఎస్సార్ సీపీ తరఫున నామినేషన్ దాఖలు చేసిన మహమ్మద్ హసన్, టీడీపీ తరఫున నామినేషన్ దాఖలు చేసిన గుల్నాజ్‌బేగంలు బీ–ఫామ్‌లు సమర్పించనందున వారి నామినేషన్లను తిరస్కరిస్తున్నట్లు ప్రకటించారు. అలాగే ఇండిపెండెంట్ అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలుచేసిన ఆకాష్‌కు ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు అర్హత వయస్సు 25 ఏళ్లకు తక్కువగా ఉండటంతో అతడి అభ్యర్థిత్వాన్ని తిరస్కరించారు. మరో ఇండిపెండెంట్ అభ్యర్థి ఓ.రెడ్డెప్ప ప్రతిపాదకుల వివరాలు తప్పుగా సమర్పించడంతో ఆయన నామినేషన్‌ను తిరస్కరిస్తున్నట్లు చెప్పారు. దీంతో నామినేషన్ దాఖలు చేసిన 19 మంది అభ్యర్థులకు సంబంధించి 33 సెట్ల నామినేషన్ పత్రాల్లో... నలుగురు అభ్యర్థులు, ఐదు సెట్ల నామినేషన్లు తిరస్కరిస్తున్నట్లు తెలిపారు. స్క్రూటినీ తర్వాత ఈనెల 29 వతేదీ వరకు ఉపసంహరణలకు గడువు ఉందన్నారు.

జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలకు అటానమస్ హోదా

- ఎస్వీయూ పరిధిలో గుర్తింపు పొందిన తొలి ప్రైవేట్ కళాశాల
- సిలబస్, ప్రశ్నపత్రాలు, పరీక్షలు సొంతంగా నిర్వహణ
- నాక్ ఏ ప్లస్ గుర్తింపు కారణంగా అర్హత పొందినట్లు వెల్లడి


కరస్పాండెంట్, ప్రిన్సిపాల్‌ను అభినందిస్తున్న రిటైర్డ్ ప్రిన్సిపాల్ మల్లికార్జున, లైబ్రేరియన్ శివప్ప

మదనపల్లె : పట్టణంలోని శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) పది సంవత్సరాల పాటు అటానమస్ (స్వయంప్రతిపత్తి) హోదా మంజూరు చేసిందని కరస్పాండెంట్ డాక్టర్.ఆర్.గురుప్రసాద్ తెలిపారు. కళాశాల అటానమస్ హోదా సాధించిన నేపథ్యంలో శుక్రవారం కళాశాలలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గురుప్రసాద్ మాట్లాడుతూ.. అటానమస్ హోదా వచ్చినందున కళాశాల అభివృద్ధికి స్వతహాగా నిర్ణయాలు తీసుకునే అవకాశం కలుగుతుందన్నారు. విద్యా విధానం, పరీక్షల నిర్వహణ, పోటీప్రపంచాన్ని ఎదుర్కొనేలా సిలబస్‌లో మార్పులు చేసుకునేందుకు వీలవుతుందన్నారు. దీంతోపాటు సామాజిక సేవా దృక్పథంతో విద్యాబోధన, ఆధునిక సాంకేతికత ఆధారంగా కోర్సుల నిర్వహణ, మెమరీ బేస్డ్ విద్యావిధానం ఏర్పాటుకు వెసులుబాటు కలుగుతుందన్నారు. క్యాంపస్ సెలక్షన్స్‌కు ప్రపంచస్థాయి సంస్థలు ముందుకు వస్తాయన్నారు. ఇకపై విశ్వవిద్యాలయంతో సంబంధం లేకుండా సిలబస్, ప్రశ్నపత్రాలు, పరీక్షలు తామే సొంతంగా నిర్వహించుకోవచ్చన్నారు. జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల గత ఏడాది న్యాక్ ఏప్లస్ అర్హత సాధించినందున, యూజీసీ అటానమస్ హోదా మంజూరుకు కళాశాల ఎంపికైందన్నారు. ఎస్వీ.యూనివర్సిటీ పరిధిలో చిత్తూరులోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, తిరుపతి టీటీడీకి చెందిన ఎస్వీ.ఆర్ట్స్ కాలేజ్‌కు అటానమస్ హోదా ఉందని, మొదటిసారిగా ఎస్వీయూ పరిధిలో అటానమస్ హోదా సాధించిన ప్రైవేట్ కళాశాలగా జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల అర్హత సాధించడం సంతోషంగా ఉందన్నారు. 24 ఏళ్లుగా తమ కళాశాల అభివృద్ధికి అన్నివిధాలుగా సహకరిస్తూ, ప్రతి విజయంలోనూ తమకు తోడ్పాటును అందించిన కళాశాల విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకబృందం, పూర్వవిద్యార్థులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలకు అటానమస్ హోదా తమపై మరింత బాధ్యత పెంచిందని, విద్యార్థుల విద్యాప్రమాణాలు మెరుగుపడేలా, మరింత మెరుగైన నాణ్యమైన విద్యాబోధన అందించి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన పలువురు కరస్పాండెంట్ డాక్టర్.ఆర్.గురుప్రసాద్, ప్రిన్సిపాల్ సురభి రమాదేవిని ప్రత్యేకంగా అభినందించారు.

బీసీల అభ్యున్నతి సీఎం జగన్‌తోనే సాధ్యం


మేమంతా సిద్ధం కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్, డాక్టర్ దేశాయ్‌తిప్పారెడి

మదనపల్లె : రాష్ట్రంలో బీసీల అభ్యున్నతి సీఎం వైఎస్.జగన్‌తోనే సాధ్యమైందని, ఐదేళ్లపాలనలో ఈ అంశం స్పష్టమైందని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్.దేశాయ్‌తిప్పారెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని దేశాయ్‌ఫంక్షన్ హాల్‌లో బీసీ నాయకులు జన్నే రాజేంద్రనాయునివారు, ముత్యాలక్కగారి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జగనన్నకు తోడుగా మేమంతా సిద్ధం పేరుతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్.దేశాయ్‌తిప్పారెడ్డిలను ఘనంగా సన్మానించారు. వారి చేతుల మీదుగా జగనన్నకు తోడుగా మేమంతా సిద్ధం కరపత్రాలను ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులు మాట్లాడుతూ...బీసీల ఎదుగుదలకు కృషిచేస్తున్న సీఎం వైఎస్.జగన్ గెలుపే లక్ష్యంగా ఈ ఎన్నికల్లో పనిచేయాలని పిలుపునిచ్చారు. కులవృత్తులకే పరిమితమైన బీసీలను అన్ని రంగాల్లో ఎదిగేలా చేసిన ఘనత సీఎం వైఎస్.జగన్‌దన్నారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు మెంబర్ యానాదయ్య, పోతబోలు సర్పంచ్ ఈశ్వరయ్య, మాలేపాడు సర్పంచ్ గణేష్, ఎంపీటీసీ రామచంద్ర, మాజీ ఎంపీటీసీ కదిరీపతి, కోటూరి ఈశ్వర్, ఆర్టీఏ నూర్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమ పాలన

రామసముద్రం : జగనన్నతోనే సంక్షేమ పాలన సాధ్యమని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్ అహమ్మద్ తెలిపారు. శుక్రవారం మండలంలోని నారిగానిపల్లె, కమ్మవారిపల్లె, ఎలకపల్లె కాప్పల్లె గ్రామ పంచాయతీలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీ ఇంటికి మంచి జరిగి ఉంటేనే జగనన్నను ఆదరించండంటూ ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎంపీపీ కుసుమ కుమారి, జెడ్పీటీసీ రామచంద్రారెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు కేశవరెడ్డి, మండల కన్వీనర్ నందకిషోర్ రెడ్డి, సిహెచ్ ప్రకాష్, రాధారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీచైర్మన్ మస్తాన్ సుబ్రహ్మణ్యం, మహబూబ్ బాషా, సర్పంచ్ లు నరసింహులు, రెడ్డప్ప నాయుడు, చరణ్, వైస్ ఎంపిపి గంగాధర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే ప్రజలకు మరింత మేలు

మదనపల్లె : సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రానికి, ప్రజలకు మరింత మేలు జరుగుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, ఏపీఎండీసీ చైర్‌పర్సన్ షమీంఅస్లాం, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్ భార్య తస్లీమ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని 26వవార్డులో వైఎస్సార్ సీపీ రాజంపేట ఎంపీ అభ్యర్థి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని, ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్‌కు ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి గెలిపించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ పాలనలోని ఐదేళ్లలో ప్రజలకు ప్రభుత్వం చేసిన మంచిని వివరించారు. మే 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఎమ్మెల్యే, ఎంపీ ఓట్లు రెండూ వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

అభివృద్ధికి ఓటుతో మద్దతు తెలపండి

- పథకాలతో అందరికీ న్యాయం చేశాం
- ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి


బి.కొత్తకోట: గుడిపల్లెలో పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డికి హారతిపట్టి మహిళల స్వాగతం

బి.కొత్తకోట : నియోజకవర్గ ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేశామని, దీనికి ప్రజలు ఓటుతో తమకు మద్దతు తెలపాలని వైఎస్సార్‌సీపీ తంబళ్లపల్లె ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారకనాథరెడ్డి కోరారు. శుక్రవారం మండలంలోని జరప్పల్లె, జరప్పల్లె కాలనీ, మొరవపల్లె, వర్రోళ్లపల్లెల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో ప్రజలను కలిసి ఎంపీ అభ్యర్థి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి తనకు ఓట్లు వేసి ఆదరించాలని విన్నవించారు. ప్రజలతో కలిసి ఐదేళ్లలో గ్రామాల అభివృద్ధికి చేపట్టిన పనులు, సంక్షేమ పథకాల అమలకు చేసిన కృషిని వివరించారు. దీనిపై ప్రజలు తమ గ్రామాలు గతంలో ఎన్నడూలేని విధంగా అభివృద్ధి చెందాయని, తమ ఇళ్లవద్దకే పాలన వచ్చిందని సంతోషం వ్యక్తం చేశారు. ఐదేళ్ల క్రితం చిన్న సమస్య పరిష్కారం కోసం మండల కేంద్రానికి వెళ్లి అధికారులతో చెప్పుకోవాల్సి వచ్చేదని, ఇప్పుడు తమ వద్దకే వచ్చిన సచివాలయ ఉద్యోగులు సమస్యలను పరిష్కరిస్తున్నారని తమ అనుభవాలను ద్వారకనాథరెడ్డితో చెప్పుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్.జగన్ ప్రభుత్వం కుల మతాలు, పార్టీలకు అతీతంగా అందరికి సంక్షేమ పథకాల ద్వారా న్యాయం చేశారన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు పాగొండ ఖలీల్, మండల కన్వీనర్ ప్రదీప్‌రెడ్డి, సర్పంచులు గిరిజ రఘునాథరెడ్డి, వెంకటరమణ, కోఆప్షన్ సభ్యులు నాసీర్, ఆదిశేఖర్‌రెడ్డి, బాబురెడ్డి, శంకర్‌రెడ్డి, ఆనందరెడ్డి పాల్గొన్నారు.

సీఎం జగనన్నతోనే నియోజకవర్గ అభివృద్ధి

తంబళ్లపల్లె : రైతులకు సాగు, తాగునీరు, నియోజకవర్గ అభివృద్ధి జరగాలంటే జగనన్న మళ్లీ సీయం కావాలని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి సతీమణి కవితమ్మ అన్నారు. శుక్రవారం జుంజురపెంట పంచాయితీలో సర్పంచు భూదేవి చంద్రాయుడుల ఆధ్వర్యంలో ముమ్మరంగా ప్రచారం చేశారు. ఎన్నికల్లో రాజంపేట ఎంపీ అభ్యర్థి మిథున్‌రెడ్డికి, ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిలకు ఫ్యాన్‌గుర్తుపై ఓట్లు వేసి అత్యధిక మెజారీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, కో–ఆప్షన్ సభ్యులు జమాల్‌బాషా, నాయకులు వైవి రమణారెడ్డి, మల్లికార్జున, రెడ్డెప్ప, రవిశంకర్‌రెడ్డి, రామశంకర్‌రెడ్డి, కోటిరెడ్డి, పద్మనాభరెడ్డి తదితరులు పాల్గొన్నారు.